క్లుప్తంగా

రామలింగేశ్వరుని సేవలో డీఆర్‌డీఏ పీడీ



విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వర స్వామిని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ నాటూరు చంద్రయ్య తొలుత వారికి స్వాగతం పలికి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం సర్పంచ్ సుజన, సచివాలయ కన్వీనర్ నరేష్, వరిణి సొసైటీ డైరెక్టర్ కాటం శీనయ్య, పార్టీ నేతలు ఎం.శ్రావణ్, టి.రమేష్ డీఆర్‌డీఏ పీడీని మర్యాద పూర్వకంగా కలిశారు.

కలుషిత నీటిని తాగొద్దు

• డాక్టర్ రిషిత



నర్సారెడ్డి కాలనీలో వృద్ధులతో మాట్లాడుతున్న డాక్టర్

పొదలకూరు : తుపాను ప్రభావంతో కొత్తనీరు వచ్చి చేరుతున్న క్రమంలో ప్రజలు కలుషిత నీటిని తాగొద్దని పొదలకూరు కో-లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్ రిషిత సూచించారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో సిబ్బందితో కలిసి ఆమె సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వర్షపునీటి వల్ల దోమల ఉధృతి పెరుగుతుందని, తద్వారా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మలేరియా, టైఫాయిడ్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే వెంటనే సమాచారం అందించాల్సిందిగా సూచించారు. కాలనీలో ఉన్న వృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలించారు. పరిశుభ్రమైన భోజనాన్ని తీసుకోవాల్సిందిగా సూచించారు. డాక్టర్ వెంట విస్తరణాధికారి రవికుమార్, సహాయకులు రాధాకుమారి, సాని శివప్రసాద్ ఉన్నారు.

శ్రామిక నగర్‌లో..

పట్టణానికి చెందిన లింగంపల్లి సబ్‌సెంటర్ పరిధి శ్రామిక నగర్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యటించి అక్కడి గిరిజనులకు పలు సూచనలు చేశారు. ఏమైనా అవసరం ఉంటే తమకు సమాచారం అందిస్తే పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మేకల లక్ష్మమ్మ అనే డయాలసిస్ బాధితురాలిని 108లో నెల్లూరుకు తరలించారు. ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, కారుణ్య, సుధా, ఆశావర్కర్ భారతి పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఊడిపడిన బస్సు లగేజి క్యారియర్



బస్సు టాప్‌పై నుంచి కింద పడిన లగేజి క్యారియర్

పొదలకూరు: పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు టాప్‌పై ఉండే లగేజి క్యారియర్ ఈదురుగాలులకు ఒక్కసారిగా గాలిలో ఎగిరి రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తు బస్సు వెనక వైపు ఏ వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం పొదలకూరుకు సమీపంలోని కాకాణి గార్డెన్స్ లేఅవుట్ వద్ద జరిగింది. అయితే బస్సు డ్రైవర్ చూసుకోకుండా వెళ్లిపోవడంతో రోడ్డుపై పడిన లగేజి క్యారియర్‌ను లేఅవుట్ యజమాని పక్కన పెట్టించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్‌లోని డానీహాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ (ఎన్‌పీఏ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగుగంగ జాయింట్ కలెక్టర్ ఓబులేసు కేక్‌ను కట్ చేశారు. ఎన్పీఏ గౌరవాధ్యక్షుడు బెన్హర్‌బాబు వాక్య సందేశాన్ని అందించారు. నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ కమిటీ నిర్వాహకులు రాఘవ మోజెస్, సురేంద్రబాబు, అరవదాసు,, బర్నబాస్ పాల్గొన్నారు.

విచారణకు వినతి

నెల్లూరు(దర్గామిట్ట): ఎలాంటి ప్రభుత్వ అనుమతుల్లేకుండానే ఐటీడీఏ పాత కార్యాలయాన్ని కూల్చేశారని, దీనిపై విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రాన్ని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. కాగా సంబంధిత అధికారులకు తెలిపి పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

వర్షం.. విధ్వంసం

• కూలిన చెట్లు, కరెంట్ స్తంభాలు
• ఈదురు గాలులతో అస్తవ్యస్తం



ముత్తుకూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కల కాలువ

పొదలకూరు : మిచాంగ్ తుపాను ప్రభావంతో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కాగా కుండపోత వర్షం మండలంలోని కొన్ని గ్రామాల్లోనే కురిసింది. మరికొన్ని గ్రామాల్లో తేలికపాటి వర్షం కురిసినా ఈదురు గాలుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొదలకూరు జెడ్పీహైస్కూల్, చెన్నారెడ్డిపల్లి ఎస్టీకాలనీ కమ్యూనిటీ హాలులో రెవెన్యూ అధికారులు బాధితులకు పునరావాసం కల్పించారు. ఈ కేంద్రాలకు మొత్తం 80 మందిని తరలించినట్లు తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 52 చెరువులు ఉండగా, వాటిలో ఏడు చెరువులు నిండాయి. కల్యాణపురం పాట్లెళ్లవాగు చెరువు, డేగపూడి(రెండు చెరువులు), వావింటపర్తి, తాటిపర్తి చిన్నచెరువు, మర్రిపల్లి, కొనగలూరు చెరువులు నిండినట్లు ఇరిగేషన్ శాఖ ఏఈలు అనిల్, రవికుమార్‌రెడ్డి చెప్పారు. మిగిలిన చెరువుల్లోకి 50 శాతం, 30 శాతం నీరు వచ్చి చేరిందని, రాత్రికి చెరువులు నిండే అవకాశం ఉందని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మండలంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని కోరారు.

వేగంగా

మండలంలో పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన చెట్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు ఈదురు గాలులకు ఒరిగిపోవడంతో అధికారులు ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మండలంలో ఉదయం 11 గంటల నుంచే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పొదలకూరు ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద మెయిన్‌రోడ్డులో చింతచెట్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యుడు అంజాద్, ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించి దగ్గరుండి చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

మనుబోలు : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండల పరిధిలో వీస్తున్న ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి స్తంభాలు నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవటంతో పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచే అంధకారం అలుముకున్నాయి. మండల కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సోమవారం రాత్రి వరకు కూడా కరెంటు సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాటర్ ప్లాంట్‌లో నీరు లేకపోవడంతో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉధృతంగా కండలేరు వాగు

మనుబోలు : మిచాంగ్ తుపాన్‌తో కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండల కేంద్రంలోని కండలేరు వాగు సోమవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ సందర్భంగా ఎస్సై అజయ్‌కుమార్ వాగును పరిశీలించారు. ఆ మార్గం గుండా ఎవరూ వెళ్లకుండా కంప వేసి మూసివేశారు. సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

సహాయక చర్యలు

కోవూరు : మిచాంగ్ తుపాన్ కారణంగా మండలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి గ్రామంలో అధికారులు, నాయకులు లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈదురు గాలుల వల్ల పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్డుపై పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో జేసీబీ ద్వారా వాటిని తొలగింపచేశారు. పాటూరు గ్రామంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. పోతిరెడ్డిపాళెంలో సర్పంచ్ శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పునరావాస కేంద్రంలో ఉన్న వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పడిపోయిన చెట్లను తొలగిస్తూ సరఫరాను పునరుద్ధరించారు.

కుండపోత

ముత్తుకూరు : మండల పరిధిలో సోమవారం కుండపోత వర్షం కురిసింది. తీరప్రాంతంలో చలితీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు వణికిపోయారు. లోతట్టు ప్రాంతాల వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. భారీ వర్షంతో నక్కలకాలువలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు మార్గాల్లో పడిపోయిన చెట్లను అధికారులు వెంటనే తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.



పొదలకూరు : మరుపూరులో కూలిన స్తంభం



ముత్తుకూరు : నేలటూరులో కూలిన చెట్లను తొలగిస్తూ..



మనుబోలు : రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



మనుబోలు : కండలేరు వాగు వద్ద రాకపోకలను నిలిపివేసిన పోలీస్ సిబ్బంది



పొదలకూరు : పొలాల్లో చేరిన వర్షపు నీరు



పొదలకూరు : చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



కోవూరు : నీరు నిల్వ ఉండకుండా పూడిక తొలగింపు

వరద నీరు చెరువులకు మళ్లింపు



మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో వరద నీటిని జేసీబీల సాయంతో సోమవారం చెరువులోకి మళ్లించారు. మండలంలోని జట్లకొండూరు గ్రామంలో వరద నీరు చేరి అరుంధతీయవాడ, హరిజనవాడ వాసులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ యాదవ్ మంత్రి కాకాణి సూచనలతో ఆ నీటిని జేసీబీల సాయంతో చెరువులోకి మళ్లించారు. అనంతరం గాలీవానకు కూలిన చెట్లను తొలగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఆవుల జగదీష్‌యాదవ్, వార్డు మెంబర్ బద్దిపూడి సురేష్, పార్టీ నేతలు కట్టుమూరి శ్రీనివాసులు, కసుమూరు మణి, రామచంద్రరెడ్డి, శివ, వేణు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్



మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామం మిక్స్‌డ్ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. కాగా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వాటర్ ట్యాంక్ మరింత దెబ్బతిని ఒక వైపు ఒరిగిపోయింది. దీంతో ఎస్సై అజయ్‌కుమార్ సోమవారం ట్యాంక్ ఉండే స్థలాన్ని పరిశీలించారు. అటు వైపు ఎవరూ రాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీరు బయటకెళ్లేలా చర్యలు చేపట్టాలి



మనుబోలు : నారుమళ్లను పరిశీలిస్తున్న ఏడీఏ శివనాయక్



విడవలూరు : నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

• ఏడీఏ శివనాయక్

మనుబోలు : నారుమళ్లు వేసిన పొలంలోని వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఏడీఏ శివనాయక్ రైతులకు సూచించారు. మండలంలోని మనుబోలు జట్లకొండూరు తదితర ప్రాంతాల్లోని పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పైరు వేసిన పొలాల్లో చిన్నచిన్న కాలువల ద్వారా నీటిని బయటకు పంపాలన్నారు. దీనివల్ల నారు పాడవకుండా ఉంటుందని వివరించారు. కొత్తగా నాట్లు వేసే రైతులు తుపాన్ ప్రభావం తగ్గిన తర్వాత పనులను మొదలు పెట్టాలన్నారు. ఆయన వెంట ఏఓ షేక్.జహీర్, వీఏఏలు తేజస్విని, ఇర్షాద్ ఉన్నారు.

వరి పంట పరిశీలన

విడవలూరు : మండల పరిధిలో నీట మునిగిన వరి పంటను ఏఓ వెంకటకృష్ణయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల పలు గ్రామాల్లో ముందుగా వేసిన నారు నీటిలో మునిగి కుళ్లిపోయిందని, రైతులు కూడా తుపాన్ తీరం దాటే వరకు నాట్లు వేయవద్దని సూచించారు. రైతులంతా వర్షాలు పూర్తిగా తగ్గే వరకు పొలాల్లోకి వెళ్ల వద్దని కోరారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ అరుణ, వలంటీర్లు క్రాంతి, దినేష్ ఉన్నారు.

బాధితులకు అండగా..



విడవలూరు : బాధితులకు భోజనాలు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది



మనుబోలు : గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

విడవలూరు : మండలంలోని రామచంద్రాపురం, చౌకచర్ల, ఊటుకూరు, ముదివర్తి గ్రామాలు నీట మునగడంతో అధికారులు సకాలంలో స్పందించి స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా వారికి భోజనం, నీరు, జనరేటర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించారు. సముద్ర తీర ప్రాంతాల్లో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్సై ఆంజనేయులు పర్యటించారు. ఈదురు గాలులు ఎక్కువగా వీస్తున్నాయని, చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడే ప్రమాదం ఉండడంతో ఎవరూ బయటకు రావద్దని సూచించారు. సముద్రం కసురు మీద ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని కోరారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాం

మనుబోలు : మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లోని గిరిజన కాలనీలను తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎస్సై అజయ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. తుపాన్ నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రానికి తుపాన్ షెల్టర్ భవనానికి తరలిస్తామని తెలిపారు.



పొదలకూరు : పునరావాస కేంద్రంలోని వారితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రేష్మసోని ఉన్నారు.

పరిశీలన

పొదలకూరు : పట్టణంలోని జెడ్పీహైస్కూల్లో సంచార జాతుల వారికి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎంపీడీఓ నగేష్‌కుమారి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. అనంతరం మండలంలోని ఇనుకుర్తి, ముదిగేడు ఎస్టీ కాలనీలకు వెళ్లి తుపాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షం, పెనుగాలుల వల్ల ఇబ్బంది పడుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు



ఇందుకూరుపేట: మైపాడు- నెల్లూరు మార్గంలో వర్షపునీటిలో వెళ్తున్న వాహనం

కడలి కల్లోలం

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ కారణంగా కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు వేట సామగ్రిని భద్రపరుచుకున్నారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఇప్పటికే వాగులు వంకలు పొంగి పార్లడంతో రోడ్లపై నీరు నిలిచింది. దీంతో ముదివర్తిపాళెం, సోమరాజుపల్లి తదితర గ్రామాలకు వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల నాట్లు వేయడంతో అవి కూడా మునిగిపోయాయి. ఈదూరు గాలులతో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో తాగునీటి, అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. మైపాడు, గంగపట్నం, రాముడుపాళెం, సోమరాజుపల్లి, ఇందుకూరుపేట, నిడిముసలి, ముదివర్తిపాళెం తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వరద బాధితులను తరలించారు. వారికి అవసరమైన ఆహారం, పాలు, ముందులు తదితర వాటిని అందజేస్తున్నారు.



ఇందుకూరుపేట : మైపాడు పునరావాస కేంద్రంలో వరద బాధితులు



ఇందుకూరుపేట : సోమరాజుపల్లి రోడ్డుపై..

విపత్తు నివారణలో అగ్నిమాపక శాఖ

నెల్లూరు(క్రైమ్): తుఫాన్ సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. పలుచోట్ల చెట్లు కూలిపోయి వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న ఏడీఎఫ్‌ఓ వేణుగోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కలెక్టర్ బంగ్లా సమీపంలో భారీ చెట్టు కూలి భవనం, ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో స్కై లిఫ్ట్ సాయంతో కొమ్మలను తొలగించారు. కొండాయపాళెం గేట్, పాత పోలీస్ కార్యాలయం, రాజరాజేశ్వరిగుడి, కొత్తూరు, బట్వాడిపాళెం సెంటర్లలో భారీ చెట్లు నేలకొరగడంతో యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అత్యవసరమైతే 99637 34284, 99499 91066, 101, 0861 – 2331051 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

మూగజీవాలు జాగ్రత్త

నెల్లూరు(సెంట్రల్): తుఫాన్‌తో మూగజీవాలకు ఇబ్బందుల్లేకుండా జాగ్రత్త వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలతో వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉందని, సమీపంలోని పశు వైద్యులను సంప్రదించి తగు సూచనలు పొందాలని కోరారు. మూగజీవాలు మరణిస్తే సమీపంలోని పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

జలకళ.. రైతన్న హర్షం



కనుపూరు చెరువు కలుజు ద్వారా నీరు విడుదల

వెంకటాచలం : మిచాంగ్ తుపాన్ కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు వర్షపు నీటితో జలకళను సంతరించుకున్నాయి. సోమవారం తెల్లవారుజామున నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో మండలంలో ప్రధానమైన సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువు, ఇడిమేపల్లి చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. సర్వేపల్లి రిజర్వాయర్ 11 అడుగుల నీటిమట్టం చేరడంతో వృథా జలాలను నక్కల కాలువ ద్వారా సముద్రానికి తరలిస్తున్నారు. కనుపూరు చెరువు, ఇడిమేపల్లి చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. ఈ వర్షంతో మండలంలో వరిసాగు చేపడుతున్న రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పూడిపర్తి, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం, ఎగువమిట్ట, తాటిపర్తిపాళెం, ఈదగాలి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం తదితర గ్రామాల్లో నారుమళ్లు నీటమునిగాయి. తిక్కవరప్పాడు, కాకుటూరు గ్రామాల్లో ముందుగా వేసిన వరినాట్లు నీట మునిగాయి.



కాకుటూరులో నీటమునిగిన వరినాట్లు